## అక్రమ నిర్మాణాల కూల్చివేత



షెడ్డును కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పెద్దఅంబర్‌పేట, మే 20: అక్రమ నిర్మాణాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్ దత్ స్పష్టం చేశారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి పసుమాములలోని సర్వేనంబర్ 422లో అక్రమంగా నిర్మించిన షెడ్డును సోమవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నిజాముద్దీన్ సిబ్బందితో కలిసి కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభు త్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

## బోడంపహాడ్‌లో బ్రహ్మంగారి వీధినాటకం



షాబాద్, మే 20 : షాబాద్ మండలంలోని బోడంపహాడ్ గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వీధినాటకాన్ని ప్రదర్శించారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ వీధినాటకం మొదటిరోజు అంగరంగా వైభవంగా ప్రారంభించారు. భజన మండలి సభ్యులు వివిధ రకాల వేషధారణలో బ్రహ్మంగారి చరిత్రను వివరించారు. కంప్యూటర్ యుగంలో కూడా వీధినాటకాలకు గ్రామాల్లో మంచి ఆదరణ లభిస్తున్నది. నాటకం చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ నెల 23వ తేదీ వరకు వీధినాటకం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

## సీపీఐ ఘన నివాళి



పెద్దఅంబర్‌పేట, మే 20: అబ్దుల్లాపూర్‌మెట్ మండల కళాకారుడు మారేడు చిన్న వర్ధంతిని ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో సోమవారం రావినారాయణరెడ్డి కాలనీలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్న మరణం ప్రజానాట్యమండలికి తీరని లోటని, అతని కుటుంబానికి అండగా నిలుస్తామని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ అజ్మీర్ హరిసింగ్‌నాయక్, నాయకులు కేతరాజు నర్సింహ, ప్రసాద్, పొన్నాల యాదగిరి, నారాయణ, పుల్లయ్య, నవనీత, దేవమ్మ, నిరంజన్, రాముడు, గణేశ్, రాములు, మధు, వినోద్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

# వరికొయ్యలు కాల్చితే నష్టం

- భూసారం దెబ్బ తినే ప్రమాదం ఎక్కువ
- పొలాన్ని కలియ దున్నితేనే పంటకు మేలు



ఇబ్రహీంపట్నం, మే 20 : అన్నదాతలు పూర్వం వరిచేళ్లను కొడవళ్లతో మొదళ్ల దాకా కోసేవారు. అంతే కాకుండా అప్పటి రోజుల్లో పశువులు ఎక్కువగా.. వరిసాగు తక్కువగా ఉండటంతో పశుగ్రాసం కుప్పలు కుప్పలుగా పెట్టుకునేవారు. ప్రస్తుతం సాగు విధానంలో అనేక మార్పులు వచ్చాయి. యంత్రాలను విరివిగా ఉపయోగిస్తుండటంతో పశువుల సంఖ్య గణనీయంగా తగ్గింది. మిషన్‌తో హార్వెస్టింగ్ చేసే సమయంలో పైకి కోయడం ద్వారా కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వరికోతలు ప్రారంభమైనందున రైతులు ఎంతో కొంత గడ్డిని తెచ్చుకోవడం, మిగిలిన దానిని అక్కడే వదిలివేస్తున్నారు. దీంతో దున్నే సమయంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని రైతులు వరికొయ్యలతో పాటు గడ్డిని కాలబెడుతున్నారు. దీనివల్ల అధిక నష్టాలు వాటిల్లే ప్రమాదం ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ వరికొయ్యలను తగులబెట్టకూడదని వ్యవసాయ నిపుణులు, వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రైతులు చాలామంది వరినాటు వేసే సమయంలో మొదటి దఫా దున్నుడుకు, రెండో దఫా దున్నుడుకు మధ్య నాలుగు నుంచి ఐదురోజుల సమయం మాత్రమే తీసుకుంటారు. దీనివల్ల కొయ్యకాలు, గడ్డి త్వరగా కుళ్లిపోవు. ఇలాంటి సమయంలో పశువులను అందులో వదిలితే అటూ తిరుగడం, పొలంలో పేడ, మూత్ర విసర్జన చేయడం ద్వారా త్వరగా కుళ్లి భూసారం పెరుగుతుంది. పంట దిగుబడి 5 శాతం పెరుగుతుంది. లేదంటే అందులోనే కలియదున్ని కనీసం ఎనిమిది రోజుల సమయం తీసుకుని రెండు దఫా దున్నాలి. వీలైతే మొదటి దఫాలో ఒక్కసారి రోటోవేటర్‌తో దున్నితే గడ్డి, కొయ్యకాలు చిన్నచిన్న ముక్కలుగా విడిపోయి తరువాత దున్నినప్పుడు ఎలాంటి సమస్య ఉండదు. దున్నే ముందు ఎకరానికి క్వింటాల్ సింగిల్ సూపర్ పాస్పేట్ చల్లితే కొయ్యలు, గడ్డి త్వరగా కుళ్లిపోతాయి. జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలు వేసి ఏపుగా పెరిగిన తర్వాత కలియదున్నితే భూమి సారవంతంగా మారుతుందని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు.

### కొయ్యలు కాల్చటం భూమికి తీవ్ర నష్టం

రైతులు వరికొయ్యలు కాల్చటం ద్వారా భూసారం తీవ్రంగా దెబ్బతినే ప్రమాదముంది. మంటల ద్వారా విపరీతమైన వేడితో భూసారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, పాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గి దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి. పొలాల్లో తిరిగే పాములు, ముంగీసలు, ఉడుములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక జీవరాసులు చనిపోయే ప్రమాదం అధికంగా ఉంది. ప్రస్తుతం వర్షాకాలం పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నందున ఈ విషయాన్ని తప్పనిసరిగా గుర్తుంచుకోవాలని సూచిస్తున్నారు. దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చని చెట్లు అగ్నికి బుగ్గవుతుంటంతో పర్యావరణానికి తీరని హాని కలుగుతుంది. ఆలస్యంగా కోతకు వచ్చే పంటలు, కల్లాల దగ్గరే ఉన్న ధాన్యం కాలిపోయి నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

### కలియ దున్నితే ప్రయోజనం

వరికొయ్యలు నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కర్బనశాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10 శాతం పెరిగే అవకాశముంది. దుక్కి దున్నే సమయంలో సింగిల్ సూపర్ పాస్పేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది. కలియ దున్నితే ఎకరాకు దాదాపుగా టన్ను ఎరువు తయారవుతుంది.

### సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది



ప్రస్తుతం రైతులు వర్షాకాలం పంట సాగులో భాగంగా వేసిన వరి పంట చేతికొచ్చినందున వరిపంటలు కోసే పనులు ప్రారంభించారు. కోతల అనంతరం పొలాలను సిద్ధం చేసుకునే రైతులు తమ వ్యవసాయ పొలాల్లోని వరికొయ్యలను తగులబెట్టకుండా భూమిని కలియదున్నాలి. దీని ద్వారా సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. వరికొయ్యకాలకు నిప్పు పెట్టడం వల్ల గాలి, నేల కలుషితమవుతుంది. రసాయన ఎరువుల వాడకం పూర్తిగా తగ్గించవచ్చు.

– వరప్రసాద్‌రెడ్డి, వ్యవసాయశాఖ మండల అధికారి

## వ్యక్తి అదృశ్యం



బికేస్‌సింగ్ (ఫైల్)

కొత్తూరు, మే 20: ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన సంఘటన కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. కొత్తూరులో నివాసముంటే ఉదయ్‌సింగ్ కుమారుడు బికేస్‌సింగ్ (34)మే 12న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. చుట్టు పక్కల, బంధువుల వద్ద ఆరా తీసినా ఫలితం లేదు. దీంతో బికేస్‌సింగ్ తల్లి ఊర్మిళాదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

చేవెళ్ల రూరల్, మే 20 : హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి నరేశ్ గౌడ్ అన్నారు. సోమవారం చేవెళ్ల మండల పరిధిలోని పల్గుట్ట గ్రామంలో హరితహారం నర్సరీ, గ్రామంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీరు పోయించారు. అనంతరం గ్రామ పరిసరాలు, ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పంచాయతీ సిబ్బంది చెత్త, చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు.

## సమయపాలన పాటించాలి

కడ్తాల్, మే 20 : మండలంలో వ్యవసాయ శాఖ అధికారులు సమయపాలన పాటించాలని పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్ గుప్తా అన్నారు. సోమవారం మండల కేంద్రానికి చెందిన పలువురు రైతులు వెంకటేశ్‌గుప్తాను కలిసి వ్యవసాయ శాఖ అధికారులు సమయపాలన పాటించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. వివిధ పనుల కోసం రైతులు వ్యవసాయ కార్యాలయానికి వెళ్లగా.. అధికారులు సమయానికి రావడం లేదని రైతులు పేర్కొన్నారు. ఈ విషయమై మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలతను ఫోన్లో సంప్రదించగా.. తనిఖీలకు వెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## దంచికొట్టిన వాన

అబ్దుల్లాపూర్‌మెట్, మే 20 : అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సుమారు గంటన్నర పాటు కురిసిన వర్షానికి రోడ్ల పై పారుతున్న వర్షపు నీటితో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. చిరు జల్లులతో మొదలైన వాన కుండపోతగా మారింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి.

## గడ్డివాము దగ్ధం



కడ్తాల్, మే 20 : ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన ఘటన సోమవారం కడ్తాల్ మండల పరిధిలోని ఏక్వాయిపల్లి గ్రామంలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం... ఏక్వాయిపల్లి గ్రామంలో ఈర్లపల్లి లాలయ్యకి చెందిన వ్యవసాయం పొలం వద్ద నిల్వ ఉంచుకున్న గడ్డివాముకు ప్రమాదవశాత్తు నిప్పంటుకున్నది. గడ్డివాము కాలిపోవడంతో రూ.40 వేల నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.

## అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ఆమనగల్లు, మే 20 : ఫర్టిలైజర్స్ దుకాణదారులు విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ అధికారిణి అరుణకుమారి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామ సమీపంలోని రైతు మిత్ర ఆగ్రో ఏజెన్సీస్‌లో విత్తనాలు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. వానకాలం–2024 సంబంధించి అధికృత డీలర్ల షాపులను ఆమె తనిఖీ చేశారు. షాపుల్లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే రైతులకు విధిగా రసీదులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీలర్లు అశోక్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏవో అరుణకుమారి

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న కొత్తూరు జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు

కొత్తూరు, మే 20: స్నేహాన్ని కన్న మిన్న లోకాల లేదురా అంటూ ఆడుతూ పాడుతూ పూర్వ విద్యార్థులు తమ స్నేహ బంధాన్ని గుర్తు చేసుకున్నారు. కొత్తూరు జడ్పీహెచ్ఎస్ 2002–2003 పదో తరగతి విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. గత అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఉత్సాహంగా గడిపారు. రానున్న సంవత్సరంలో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

## నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టాలి

కులకచర్ల, మే 20 : నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని చురుగ్గా నిర్వహించాలని డీఎల్పీవో సంధ్యారాణి అన్నారు. సోమవారం సాయంత్రం కులకచర్ల గ్రామ పంచాయతీలో ఉన్న నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నర్సరీల్లో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మొక్కలకు ఎప్పటికప్పుడు నీటిని అందించాలని, హరితహారం కింద మొక్కలు నాటించేందుకు సిద్ధం కావాలని సూచించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డికి సూచనలు చేశారు.

## అమ్మకు అర్హత పరీక్ష.. నాన్నకు పిల్లలతో నిరీక్షణ





పెద్దఅంబర్‌పేట, మే 20: మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు సమీపంలోని పల్లవి ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం ఏర్పాటుచేసిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కేంద్రానికి అభ్యర్థులు తరలివచ్చారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష కాగా, 8 గంటల వరకే కేంద్రానికి చేరుకున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, సంగారెడ్డి తదితర జిల్లాల నుంచి అభ్యర్థులు పరీక్ష రాసేందుకు వచ్చారు. తల్లులు పరీక్ష రాసేందుకు కేంద్రంలోకి వెళ్లగా.. వారి పిల్లలను తండ్రులు కేంద్రం బయటే ఆడిపాడిస్తూ పై విధంగా కనిపించారు.

## 15 రోజులు కూచిపూడి వర్క్‌షాప్



కూచిపూడి నృత్యంలో మెళకువలు తెలుపుతున్న గురువు మంజూభార్గవి

కొండాపూర్, మే 20 : కూచిపూడి నృత్యంలో మెళకువలు నేర్పించేందుకు ప్రముఖ నాట్య గురువులు, శంకరాభరణం ఫేమ్, కళారత్న, సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత మంజూభార్గవి మాదాపూర్‌లోని శిల్పారామం ఎథినిక్ హాల్‌లో 15 రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు సోమవారం తెలిపారు. మే 20 నుంచి కొనసాగుతుందని, ఏడేండ్లు పైబడి, ఆసక్తి కలిగిన వారు 9948078459 నంబర్ ద్వారా సంప్రదించవచ్చన్నారు. నాట్య గురువులు రమణి సిద్ధి, మృత్యుంజయులు అందుబాటులో ఉంటారని, నృత్యంలో మెళకువలను అందించనున్నట్లు తెలిపారు.

# కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ



శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న వివేకానంద నగర్ డివిజన్ కాలనీ వాసులు

మాదాపూర్, మే 20 : కాలనీలోని సమస్యలు పరిష్కరిస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వోల్గా ప్రైడ్ అపార్ట్‌మెంట్స్, భాస్కర ప్యాలస్, శ్రీదేవి రెసిడెన్సీ, తీక్షా రెసిడెన్సీ, బాబు రెసిడెన్సీ, శ్రీకృష్ణ నివాస్ వాసులు పలు సమస్యలు, అభివృద్ధి పనులపై సోమవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. వారితో మాట్లాడిన ఎమ్మెల్యే గాంధీ డ్రైనేజీ సమస్యలు త్వరగా పరిష్కరించాలని, వరద నీరుసాఫీగా పోయేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. డ్రైనేజీ పొంగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, యూజీడీ పైప్‌లైన్లు పెద్దవి వేసి శాశ్వత పరిష్కారం చూపాలని తెలిపారు. పలు సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడుతానన్నారు. డ్రైనేజీ పునరుద్ధరణ పనులు తక్షణమే చేపట్టి ప్రజలకు ఉపశమనం కలిగేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, పార్టీ నాయకులు ఉన్నారు.

### ఘనంగా నాగలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలో నాగ లింగేశ్వర స్వామి దేవస్థానం 6వ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ విచ్చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. పూజలు చేసిన అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలను వడ్డించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## బడంగ్‌పేటలో తహసీల్దార్ కార్యాలయం

బడంగ్‌పేట, మే 20: బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయం సోమవారం నుంచి బడంగ్‌పేటలో కొలువుదీరింది. తహసీల్దార్ మాధవి రెడ్డి పూజలు చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కందుకూరు ఆర్డీవో సూరజ్ కుమార్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. అన్ని రూమ్‌లను తిరిగి పరిశీలించారు. సౌకర్యాల గురించి తహసీల్దార్ మాధవిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. బాలాపూర్ నుంచి బడంగ్‌పేటకు తహసీల్దార్ కార్యాలయాన్ని మార్చడానికి అధికారులు ఇబ్బందిపడ్డా. స్థానికంగా ఉన్న కొంత మంది కార్యాలయాన్ని మార్చకుండా అడుగడుగునా ఆటంకాలు కల్పించారు. బాలాపూర్‌లో ఉన్న తహసీల్దార్ కార్యాలయం ఇరుకుగా ఉండటం వలన సిబ్బందికి కూర్చోవడానికి వీలు లేకుండా ఉండేది. దీంతో అధికారులు నిత్యం ఇబ్బందులు పడేవారు. కార్యాలయానికి వచ్చే వారికి సైతం ఇబ్బంది కరంగా ఉండేది. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఏర్పాటు చేసిన కొత్తలోనే అప్పటి తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి బడంగ్‌పేటలో ఉన్న పాత మున్సిపల్ కార్పొరేషన్ భవనం కావాలని కలెక్టర్‌కు విన్నపించారు. అయితే స్థానికంగా ఉన్న సమస్యలతో తహసీల్దార్ కార్యాలయం తరలించడానికి అనేక సమస్యలు సృష్టించారు. వాటర్ వర్క్స్ కార్యాలయానికి ఇవ్వాలని, మరో కార్యాలయానికి ఇవ్వాలని అప్పట్లో డిమాండ్ పెట్టారు. అందరికి అనువైన స్థలంలో ఉన్న భవనం తహసీల్దార్ కార్యాలయానికి కావాలని రెవెన్యూ అధికారులు జిల్లా కలెక్టర్‌తో అనుమతి తీసుకున్నారు. కలెక్టర్ అనుమతి తీసుకున్న తర్వాత కూడా భవనం తాళం తీయకుండా కొంత కాలం జాప్యం చేశారు. చివరకు ప్రజా ప్రతినిధులు కొంత మంది స్థానికులను రెచ్చ గొట్టే ప్రయత్నం చేశారు. బాలాపూర్‌లో అఖిలపక్షం ఏర్పాటు చేశారు. బాలాపూర్‌లోనే తహసీల్దార్ కార్యాలయం ఉంచాలని వారు డిమాండ్ చేశారు. తరలించనివ్వకుండా అడ్డుకుంటామని హెచ్చరికలు చేశారు. చివరకు కలెక్టర్ వరకు ఈ వివాదం వెళ్లింది. కలెక్టర్ చెప్పినప్పటికి బడంగ్‌పేట మున్సిపల్ కమిషనర్ సైతం ఇందులో జోక్యం చేసుకోవడం మరింత సమస్య వివాద స్పదంగా మారింది. ఎట్టకేలకు అధికారులు తహసీల్దార్ కార్యాలయాన్ని మార్చేశారు.



తహసీల్దార్ కార్యాలయంలో కూర్చోని వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో సూరజ్ కుమార్ చిత్రంలో తహసీల్దార్ మాధవిరెడ్డి

## వినియోగదారులు సహకరించాలి

హయత్‌నగర్, మే 20 :విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనుల దృష్ట్యా 11కేవీ ఆలిండియా రేడియో ఫీడర్, 33/11 కేవీ ఆటోనగర్ సబ్‌స్టేషన్ నుంచి సప్లయ్ చేసే విద్యుత్‌ను ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిలిపివేయనున్నట్లు హయత్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లెక్చరర్స్ కాలనీ ఫీడర్ నుంచి 33/11కేవీ హయత్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీ, వినాయక్ నగర్ కాలనీల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆర్టీసీ కాలనీ, ఆర్టీసీ సూపవైజర్స్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, ఎల్ఐసీ కాలనీ, వీరభద్ర కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఉపాధి పనులను పకడ్బందీగా నిర్వహించాలి

- ఎంపీడీవో నరేందర్‌రెడ్డి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం, మే20: ఉపాధి హామీ పనులను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఉపాధి పనులను కొలతలు వేసి రికార్డుల్లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి పనులు కల్పించాలన్నారు.

## తుంగతుర్తి అసెంబ్లీ ఇన్‌చార్జిగా శ్రీనివాస్‌రెడ్డి



ఆమనగల్లు, మే 20 : నల్గొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో తుంగతుర్తి అసెంబ్లీ ఇన్‌చార్జిగా కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.

## ఇంటి గేట్ దిమ్మె కూలి చిన్నారి మృతి

షాద్‌నగర్, మే 20 : ఇంటి ముందు ఆడుకుంటున్న ఓ చిన్నారిపై ఇంటి ముందు ఉన్న గేటు దిమ్మె కూలి మృతి చెందింది. ఈ ఘటన ఫరూఖ్‌నగర్ మండలం మధురాపూర్ గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పి. మల్లేశ్, రమాదేవి దంపుతుల కూతురు సాక్షి (4) ఇతర పిల్లలతో కలిసి ఇంటి ముందు ఆడుకుంటున్నది. తమ ఇంటి ముందు గోడకు ఒరిగి ఉన్న గేట్ దిమ్మెను ఆ చిన్నారి తాకడంతో అది కూలి ఆమె తలపై పడింది.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుర్కయంజాల్, మే 20 : మన్నెగూడ ఫీడర్ పరిధిలో సాధారణ మరమ్మతుల కారణంగా మన్నెగూడ విలేజ్, ఎన్ఎస్ఆర్ నగర్ కాలనీ, ప్రముఖ్ టౌన్‌షిప్, ఎంఎం కుంట, సాయి టౌన్‌షిప్, హెవెన్స్ కార్నర్, మై హోమ్స్, వెంకటాద్రి టౌన్‌షిప్ కాలనీల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ రవివర్మ సోమవారం తెలిపారు. అదేవిధంగా తుర్కయంజాల్ ఫీడర్ పరిధిలోని లక్ష్మి మెగా టౌన్‌షిప్, పాటిగూడ, సూరజ్‌నగర్, బాలాజీ హోమ్స్, కుంట సాయిరెడ్డి నగర్‌లో కూడా సాధారణ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు.

### ఇంజాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో

మున్సిపాలిటీ పరిధి ఇంజాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో సాధారణ మరమ్మతుల కారణంగా 2 గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ రాములు తెలిపారు.